సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు టెలికాంనగర్, ఆర్‌టీటీసీ, ఉర్దూ యూనివర్సిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఐఐఆర్‌ఎం, నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాయి ఐశ్వర్య కాలనీ, సాయి వైభవ్ కాలనీ, జైన్ కన్‌స్ట్రక్షన్స్, ఖాజాగూడ విలేజ్, ఖాజాగూడ వీకర్ సెక్షన్, నిహారిక కన్‌స్ట్రక్షన్స్, సాయి కృపా కాలనీ, కరాచీ బేకరీ మెయిన్‌రోడ్, చిత్రపురి కాలనీ, ల్యాంకో టవర్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి : తారానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఉమారాణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పాపిరెడ్డి నగర్ కాలనీ, 100 ఫీట్ న్యూరోడ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

- దూబేకాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సురభికాలనీ, ఆదర్శనగర్ కాలనీ రోడ్ నంబర్ 1,2,3, దూబేకాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని చెప్పారు.

నేడు ట్రిపుల్‌ఐటీలో ఆర్ అండ్ డీ షోకేస్

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో వార్షిక ఆర్ అండ్ డీ షోకేస్–2023 కార్యక్రమాన్ని శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.15 గంటలకు ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యవక్తగా ఆధార్ అండ్ ఇండియా స్టాక్ చీఫ్ ఆర్కిటెక్ట్ ప్రమోద్‌వర్మ పాల్గొంటారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్లు, పోస్టర్లను ప్రదర్శిస్తారు.

డేటా అనలిటిక్స్‌లో కొత్త కోర్సులు...

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల ఎక్కువగా యువత ఆదరణ పొందుతున్న డేటా అనలిటిక్స్‌లో సరికొత్త కోర్సులను మాదాపూర్‌లోని గ్రేట్ లెర్నింగ్ కెరీర్ అకాడమీ ప్రారంభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. బెంగుళూర్, చెన్నై, గుర్‌గావ్‌ల తర్వాత నగర యువతకు వీటిని అందుబాటులోకి తెచ్చామన్నారు. పట్టభద్రుల కోసం రూపొందించిన ఈ స్వల్పకాలిక 4నెలల తరగతి గది కోర్సుల పూర్తి తర్వాత నేరుగా కార్పొరేట్ సంస్థల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు.

పాజిటివ్ నిల్

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన కొవిడ్ టెస్టులలో జీరో పాజిటివ్ అని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరదాచారి తెలిపారు. శుక్రవారం కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో 21 మందికి పరీక్షలు నిర్వహించారు. ఒకరికి ఆర్‌టీపీసీఆర్, 20 మందికి రాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 'హౌ టు గో విత్ ది ఫ్లో' అనే అంశంపై అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన ఐటీ ఆర్కిటెక్ట్ బి.కె.హర్షా ఉపన్యాసం ఇస్తారు.

'మనూ'లో ముగిసిన వర్క్‌షాప్

రాయదుర్గం: మనూలో 'మాలిక్యులర్ బయాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్'పై నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. 'టూల్స్ అండ్ టెక్నిక్స్ ఆఫ్ మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్–2' అనే అంశంపై రెండురోజుల వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో జంతు శాస్త్ర పరిశోధక విద్యార్థులు కణం, డీఎన్‌ఏ, ప్రొటీన్ ఆధారిత పద్ధతులపై వెట్ ల్యాబ్ సెషన్‌లను ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్‌ఖాన్, వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొ.పర్వీన్ జహాన్, కో కన్వీనర్ డా.ఆరీఫ్ అహ్మద్, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొ.అశ్వినినంగియాకు అరుదైన గౌరవం



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అశ్వినినంగియాకు అరుదైన గౌరవం లభించింది. ప్రొఫెసర్ ఎస్ స్వామినాథన్ అవార్డును ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ న్యూఢిల్లీ ప్రదానం చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ డీన్, సీనియర్ ప్రొఫెసర్ అశ్వినినంగియాకు ప్రొఫెసర్ ఎస్ స్వామినాథన్ 60వ జన్మదిన స్మారక లెక్చర్ అవార్డు లభించింది. ఎస్‌ఈఆర్‌బి–డీఎస్‌టీ యొక్క జేసీ బోస్ ఫెలో, దేశంలోని మూడు ప్రధాన జాతీయ సైన్స్ అకాడమీలలో ఫెలో, ప్రపంచ శాస్త్రవేత్తల స్టాన్‌ఫోర్డ్ జాబితాలో ఉన్నత స్థానంలో ఉన్నారు. లండన్‌లోని రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీకి ఫెలోగా కూడా పనిచేశారు.

కంప్యూటర్లు..కొత్త కళ

- ప్రిన్సిపల్ చొరవతో అందుబాటులోకి పది కంప్యూటర్లు
- ఏటా కంప్యూటర్ అప్లికేషన్ కోర్సుకు పెరుగుతున్న డిమాండ్



రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్..

రాయదుర్గం: ఉపాధి ఆధారిత కోర్సులకు ప్రాధాన్యం పెరుగుతోంది. కంప్యూటర్ అప్లికేషన్స్ పేరిట నిర్వహించే ఒకేషనల్ కోర్సులో చేరేందుకు విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్‌స్థాయి చదువుతోనే ఉపాధి అవకాశాలు లభించే కోర్సులు కూడా మరిన్ని పెంచాలనే డిమాండ్ కూడా వినిపిస్తోంది. మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఒకేషనల్ కోర్సుకు ప్రతిఏటా ఆదరణ పెరుగుతోంది. కంప్యూటర్ కోర్సుల్లో ఉత్తీర్ణులయితే ఉపాధి అవకాశాలు ఈ ప్రాంతంలోనే దొరుకుతాయనే భావన చాలా మందిలో ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు ప్రత్యేక చొరవతో ఆయన స్నేహితులు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేయూత అందించేందుకు ముందుకొచ్చారు. రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పది కంప్యూటర్లు తాజాగా అందుబాటులోకి రాగా, మరో పదింటిని కూడా అందించేందుకు ఆయన స్నేహితులు అంగీకరించారు. దీంతో కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌కు కొత్త కళ వచ్చినట్టయ్యింది. ప్రస్తుతం కళాశాలలో రెగ్యులర్ కోర్సులతోపాటు కంప్యూటర్ అప్లికేషన్‌లో ఒకేషనల్ కోర్సును కూడా అందిస్తున్నారు.

నాడు ఆరుగురు.. నేడు 106 మంది

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదట్లో ప్రభుత్వం రెండు కంప్యూటర్లు కేటాయించారు. ఒకేషనల్ కోర్సులో ఆరుగురే విద్యనభ్యసించేవారు.
- ఆరేళ్ల క్రితం సదర్‌ల్యాండ్ సంస్థ పది కంప్యూటర్లు అందించడంతో విద్యార్థులకు థియరీతో పాటు ప్రాక్టికల్స్ నేర్పడానికి వీలైంది.
- కొన్ని రోజుల తర్వాత ఈ కంప్యూటర్లు కాస్త పనిచేయకపోవడంతో ప్రభుత్వం కేటాయించిన రెండింటితోనే నెట్టుకొచ్చారు.
- గత ఏడాది ఈ కోర్సులో 50 మంది విద్యార్థులు చేరడంతో ప్రిన్సిపల్ శ్రీనివాసులు తన స్నేహితులతో మాట్లాడి కొత్తగా పది కంప్యూటర్లు కేటాయించేలా చూశారు.
- ఈ ఏడాది ఏకంగా ఈ కోర్సులో 106 మంది విద్యార్థులు చేరారు. దీంతో కంప్యూటర్ల అవసరం మరింత పెరిగింది. దీంతో తన స్నేహితులపై మరింత ఒత్తిడి పెంచడంతో మరో పది కంప్యూటర్లు ఇచ్చేందుకు వారు అంగీకరించారు.
- ప్రస్తుతం థియరీ బోధన ఒక పూట చేస్తుండగా మరోపూట పూర్తిగా ప్రాక్టికల్స్ నేర్పిస్తున్నారు.

ఒకేషనల్ కోర్సుకు మంచి ఆదరణ



కంప్యూటర్ అప్లికేషన్స్ ఒకేషనల్ కోర్సుకు విద్యార్థుల నుంచి మంచి ఆదరణ వస్తోంది. చుట్టూరా ఐటీ సంస్థలు ఉండడంతో ఈ కోర్సులో చేరితే భవిష్యత్ బాగుంటుందని అనుకుంటున్నారు. దీంతో ఈ కోర్సు పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. బోధన, ప్రాక్టికల్స్‌పై లెక్చరర్లు ప్రత్యేక దృష్టి పెట్టారు.

–శ్రీనివాసులు, ప్రిన్సిపల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాయదుర్గం

ఉపాధి అవకాశాల వేదిక జాబ్‌మేళా



కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: చందానగర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో జీహెచ్ఎంసీ సహకారంతో లైట్ హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను జోనల్ కమిషనర్ శంకరయ్యతో కలిసి ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ మేళాలు ఉపాధి అవకాశాల వేదిక అని అన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ ఉషారాణి, ఫౌండేషన్ ప్రతినిధులు అమృత, శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీధర్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోహన్ గౌడ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని బీజేవైఎం రాష్ట్ర నాయకులు రాజుగోపాల్ యాదవ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు దీపక్ గౌడ్, మహేశ్ యాదవ్, శివ, గణేష్, లడ్డు, సాయి, నరేష్‌చారి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారాలకు అనుమతివ్వాలని వినతి



టౌన్ ప్లానింగ్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: వీధి వ్యాపారాలకు అనుమతి ఇవ్వాలని జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ మెహ్రాను కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ స్వయం ఉపాధితో కుటుంబాలను పోషించుకుంటున్న వారు ఇబ్బందులుపడుతున్నారని, కార్యకలాపాలను నిర్వహించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్ట్రీట్ వెండర్స్ పాల్గొన్నారు.

27న గీతంలో జాతీయ సదస్సు

పటాన్‌చెరు టౌన్: లలిత కళలు, వాటి ప్రాముఖ్యతను తెలియజేసే లక్ష్యంతో గీతంలో ఈనెల 27వ తేదీన జాతీయ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్టు లలిత కళల విభాగం సమన్వయకర్త, సదస్సు నిర్వాహకురాలు డాక్టర్ మైథిలి మరాట్ అనూప్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని ఎస్.ఎన్.స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నృత్య విభాగం ప్రొఫెసర్, నటి డాక్టర్ అరుణ భిక్షు, ఐఐటీ బాంబేలోని భాష– సాహిత్య అధ్యయనాల విశ్రాంత ఆచార్యుడు, హిందుస్తానీ శాస్త్రీయ గాయకుడు డాక్టర్ మిలింద్ మల్లే ముఖ్య వక్తలుగా పాల్గొంటారన్నారు. 'సమకాలీన కాలంలో ప్రదర్శనల సౌందర్యం– డిజిటల్ యుగంలో వాటి తీరుతెన్నులు' అనే అంశంపై చర్చా గోష్ఠి నిర్వహించనున్నట్టు ఆమె వివరించారు. యునెస్కో గుర్తింపు పొందిన సంప్రదాయ భారతీయ కళారూపం 'కుటియాట్టం'ను సదస్సు ముగింపు సమయంలో ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

పెండింగ్ పనులను సత్వరం పూర్తి చేయాలి



సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం జీహెచ్‌యంసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ, పార్కులకు సంబంధించి నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకున్నారని, వెంటనే ఈ పనులు పూర్తి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో 95శాతం పనులు పూర్తి చేశామని పెండింగ్‌లో ఉన్న పనులు కూడా త్వరలో పూర్తి చేయిస్తామని ఆయన తెలిపారు.

కంటి వెలుగులో 1,247 మందికి పరీక్షలు




శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రాజేంద్రకుమార్

శేరిలింగంపల్లి: 'కంటి వెలుగు' కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో మొత్తం 1,247 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. ఇందులో 507 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కాగా కంటి పరీక్షలలో 32 మందికి సర్జరీ అవసరం అని నిర్ధారించారు. వారికి త్వరలో ఆపరేషన్ చేస్తారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని కమిషనర్ రాజేంద్రకుమార్ పరిశీలించారు. కంటి పరీక్షల తీరును అడిగి తెలుసుకున్నారు.ఈ పథకాన్ని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

ప్యాచ్ వర్కు పనుల పరిశీలన



ప్యాచ్ వర్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అధికారులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో జేఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ మెయిన్‌రోడ్డుపై హైటెన్షన్ కేబుల్ పనులు కోసం తవ్విన రోడ్డు ప్యాచ్ వర్కు పనులను జీహెచ్‌యంసీ అధికారులతో కలిసి శుక్రవారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సంగీతోత్సవాలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవాలు సందర్శకులను అలరించాయి. శుక్రవారం విద్వాన్ మందా శ్రీనివాస్ భజన, విదుషీ అంజనా కీర్తనలను ఆలపించారు. వయొలిన్ విద్వాన్ కె.ఎల్.ఎన్.మూర్తి, మృదంగం కృష్ణశ్రావణ్, కంజీరా శ్యామ్‌కుమార్‌లు వాయిద్య సహకారాన్ని అందించారు.

ఉపాధిహామీ నిధులను సద్వినియోగం చేసుకోవాలి

పటాన్‌చెరు: ఉపాధి హామీ నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రజా ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఎమ్మెల్యే అధ్యక్షతన ఉపాధి హామీ పథకం నిధుల వినియోగంపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే నిధులను ప్రజా అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని ఖర్చు చేయాలని కోరారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తదితరులు

హఫీజ్‌పేట్ : మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 109 లబ్ధిదారులకు రూ.1,09,12,644ల షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం కార్పొరేటర్లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వంగా పేరుగాంచిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు అశోక్ గౌడ్, రవీందర్ ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, రాజు యాదవ్, రాజు నాయక్, శ్రీనివాస్ యాదవ్, గంగాధర్‌రావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమనరెడ్డి జయంతి



జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో యోగి వేమనరెడ్డి జయంతి వేడుకలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం యోగి వేమనరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక కార్పొరేటర్ పూజిత గౌడ్, డివిజన్ అధ్యక్షులు గౌతమ్‌గౌడ్‌లు హాజరై వేమనరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాకవి వేమన ప్రజాకవి, సంఘ సంస్కర్త అని ఆయన గురించి నేటి తరానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు నల్లా సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, దుగ్గి రవీందర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, శేరి అంతిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, అజయ్‌కుమార్ రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి ,ప్రవీణ్‌గౌడ్, ఎస్సీసెల్ అధ్యక్షులు కంది జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

గ్రీన్ ఇండియా ఛాలెంజ్

మొక్క నాటిన మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి



గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా తనయుడు ప్రణవ్‌తో కలిసి మొక్క నాటిన డీసీపీ శిల్పవల్లి

గచ్చిబౌలి: ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా నిర్మల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ ఇచ్చిన ఛాలెంజ్‌ను మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి స్వీకరించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయం ఆవరణలో తన తనయుడు ప్రణవ్ పుట్టినరోజు సందర్భంగా కొడుకుతో కలిసి మొక్క నాటారు. అనంతరం నల్గొండ ఎస్పీ రమా రాజేశ్వరీ, ప్రముఖ డ్యాన్సర్ ఆనంద్ శంకర్ జయంత్‌లకు మొక్కలు నాటాలని ఛాలెంజ్ విసిరారు. మాదాపూర్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ రఘునందన్‌రావు, సీఐలు సునీత, సురేష్, శివకుమార్ పాల్గొన్నారు.



క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయం

పటాన్‌చెరు: క్రీడలను ప్రోత్సహించడంతో పాటు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నర్రగూడెంలో బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జీఎమ్మార్ టెన్నిస్ బాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్ పాల్గొన్నారు.

నేరాల కట్టడికి చర్యలు

- కొల్లూరులో నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు
- కసరత్తు చేస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు
- పెట్రోలింగ్‌కు నూతన వాహనాల కేటాయింపు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అందుకు తగ్గట్టుగా నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్, కొల్లూర్, ఈదుల నాగులపల్లి, వెలిమెల ప్రాంతాల్లో రోజురోజుకు నూతన కాలనీలు ఏర్పడుతున్నాయి. నగర ప్రాంతం నుంచి అనేకమంది ఇక్కడ ఇళ్లు కొనుగోలు చేసి స్థిరపడుతున్నారు. పెద్ద పెద్ద కంపెనీలు సైతం బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నాయి. జనాభా పెరగడంతో పోలీస్ ఉన్నతాధికారులు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలకు ఎలాంటి భద్రత కల్పించాలి.. పెట్రోలింగ్ ఏ విధంగా చేయాలనే అంశాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

- తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రేడియల్ రోడ్డుతో పాటు విల్లాస్, బహుళ అంతస్తుల భవనాలు రావడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, అనేక మంది ప్రముఖులు ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు.
- దీంతో పోలీసులు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఏదైనా సంఘటన జరిగితే ఐదు నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకునే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టారు.
- అందులో భాగంగా ఈ ప్రాంతానికి సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో రెండు పెట్రోలింగ్ వాహనాలను కేటాయించారు.
- అలాగే మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.
- ఇప్పటికే అధికారులు స్థల పరిశీలన సైతం పూర్తి చేశారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర సైతం నెల రోజుల్లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటవుతుందని చెప్పారు.

రంగారెడ్డిలోని కొన్ని గ్రామాలు..

- రంగారెడ్డి జిల్లాకు చెందిన పలు ప్రాంతాలను కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో కలుపుతున్నారు.
- పోలీస్‌స్టేషన్ సంగారెడ్డి జిల్లాలో ఉండగా రంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రాంతాలను పోలీస్‌స్టేషన్‌లో కలపడం ద్వారా మున్ముందు ఏమైనా సమస్యలు వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.
- ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తారని గతంలో ప్రచారం జరిగింది.
- పరిధిని పెంచేందుకు రంగారెడ్డి జిల్లాకు చెందిన పలు ప్రాంతాలను పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తీసుకువస్తున్నట్టు తెలుస్తోంది.
- వాటికి బదులు మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి, వెలిమెలను కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తీసుకు వస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

నేరాలు తగ్గుతాయి



కొల్లూరు పరిధిలో నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయం. ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతోంది. ఐటీ ఉద్యోగులు, వ్యాపారస్తులు ఇక్కడ నివాసముంటున్నారు. పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో అందరికీ మరింత భద్రత ఉంటుంది.

– మయూరి, కొల్లూరు కౌన్సిలర్

ఆనందంగా ఉంది



కొల్లూర్‌లో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. ఈ ప్రాంత భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, డీసీపీ శిల్పవల్లికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– నీలిమ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి